

ముషీరాబాద్‌లో కరాటే పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

క్రీడలపై దృష్టి సారించాలి: ఎమ్మెల్యే

ముషీరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ముషీరాబాద్‌లోని గంగపుత్ర సంఘ భవనంలో తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కోశాధికారి బి.రాకేష్ ఆధ్వర్యంలో 7వ తెలంగాణ స్టేట్ లెవల్ తైక్వాండో చాంపియన్‌షిప్ 2024 పోటీలను నిర్వహించారు. తైక్వాండో అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన పోటీలకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరాటే ఆత్మస్థైర్యంతో పాటు ఏకాగ్రతను పెంపొందిస్తుందన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రీడలపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి రాకేష్, ముషీరాబాద్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు ఎయిర్‌టెల్ రాజు, బల్వంత్ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్య నాయకుల సమావేశంలో రామారావు మాదిగ తదితరులు

కోర్టు తీర్పు వచ్చినా వర్గీకరణ చేయకపోవడం దారుణం

చిక్కడపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలు అమలు చేసుకునే విధంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా పట్టించుకోకపోవడం సరికాదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి రామారావు మాదిగ అన్నారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్ అన్నానగర్ బస్తీలో డివిజన్ ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులు సమావేశం ఇల్లందుల ఎల్లయ్య మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామారావు మాదిగ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎస్సీ వర్గీకరణ అమలు చేయకపోవడం వల్ల మాదిగలు, ఉపకులాలకు దక్కాల్సిన ఫలాలు అందడం లేదన్నారు. దీనికి నిరసనగా మందకృష్ణమాదిగ నాయకత్వంలో ఫిబ్రవరి 3వ తేదీన 'వెయ్యి గొంతులు - లక్ష డప్పులు' మహాప్రదర్శన చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు.



అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ వెంకటరాజయ్య, ప్రొఫెసర్ మురళీమనోహర్

టీచర్స్ ఎమ్మెల్సీగా వెంకటరాజయ్యను గెలిపించాలి

రాంనగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే నల్గొండ, వరంగల్, ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రొఫెసర్ వెంకటరాజయ్యను గెలిపించేందుకు ఉపాధ్యాయులందరూ మద్దతు ఇవ్వాలని ప్రొఫెసర్ మురళీమనోహర్ సూచించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ వెంకటరాజయ్యకు మద్దతుగా ఉపాధ్యాయ జేఏసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ప్రొఫెసర్ వెంకటరాజయ్యను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ సింహాద్రి, ప్రొఫెసర్ గడ్డం మల్లేశం, ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్‌రావు, ప్రొఫెసర్ నాగుల వేణుయాదవ్, డాక్టర్ జీవన, ఉపాధ్యాయులు బి.మల్లయ్య, సామాజిక కార్యకర్తలు వై.సందీప్, హైకోర్టు మాజీ ఏజీపీ జక్కుల కృష్ణయాదవ్, న్యాయవాది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ

ముషీరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్‌లో సత్యసాయిబాబా ట్రస్ట్ గాంధీనగర్ శాఖ ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ట్రస్ట్ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్ కుమార్ హాజరై వృద్ధులకు బియ్యం, పప్పు, నూనె, చెక్కర తదితర వస్తువులను అందజేశారు. ట్రస్ట్ ప్రతినిధులు రాజగోపాల్, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు సరుకులు పంపిణీ చేస్తున్న బిజ్జి కనకేష్‌కుమార్, రాజ్‌గోపాల్



మాట్లాడుతున్న బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావు

పబ్‌లకు రాత్రి 12 గంటల వరకే అనుమతివ్వాలి

బర్కత్‌పుర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం వేడుకల్లో పబ్‌లకు అర్ధరాత్రి 12 గంటల వరకే అనుమతివ్వాలని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావు రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనర్లకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం కాచిగూడలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ఈనెల 31న అర్ధరాత్రి 12 గంటల వరకే పబ్‌లను నిర్వహించాలని పోలీసులు ఆదేశించాలన్నారు.



వేడుకల్లో సంజీవరెడ్డి, కె.రాజు, ఎల్.డి.పాల్, ఏ.ఆర్.శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

వీఎస్టీ కార్మికుల సంక్షేమమే యూనియన్ లక్ష్యం

రాంనగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వీఎస్టీ కార్మికుల సంక్షేమం, కంపెనీ అభివృద్ధి లక్ష్యంగా తమ యూనియన్ పనిచేస్తుందని జీ.సంజీవరెడ్డి గ్రూప్ కార్మిక నాయకులు కె.రాజు, ఎల్.డి.పాల్, ఏ.ఆర్.శ్రీనివాస్‌యాదవ్, నాగేష్‌లు తెలిపారు. వీఎస్టీ వర్కర్స్ అధ్యక్ష పదవి కోసం జరిగిన ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ తరఫున పోటీ చేసిన ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జీ.సంజీవరెడ్డి విజయం పురస్కరించుకుని ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని యూనియన్ కార్యాలయంలో విజయోత్సవ వేడుకలు జరిగాయి.

చిక్కడపల్లి: ప్రతిష్టాత్మక వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడి ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి విజయంపట్ల కంపెనీ సీనియర్ వర్కర్, గాంధీనగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర సీనియర్‌నేత కుడిది రాజు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి: ఆజామాబాద్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. హర్రాజ్‌పెంట, బాలాజి ఇంద్రప్రస్థ, ఎర్రంమంజిల్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, రాంనగర్ పరిధిలో 10.30 నుంచి 1 గంట వరకు, నెహ్రూనగర్, సుందర్‌నగర్ పరిధిలో 11.30 నుంచి 1.30 గంటల వరకు, మౌలానా ఆజాద్‌నగర్, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆలయంలో నిర్వహణ లోపం

చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి గర్భగుడి ముందు విరిగిన స్టీల్‌గ్రిల్స్

తాళ్లతో కట్టిన సిబ్బంది

రాంనగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో పేరొందిన చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఆలయం గర్భగుడి ఎదుట భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూకు సంబంధించిన స్టీల్‌గ్రిల్స్ విరిగి పడిపోయే స్థితికి చేరుకున్నాయి. ప్రమాదకరంగా మారిన స్టీల్ గ్రిల్స్‌ను ఆలయ సిబ్బంది తాళ్లతో కట్టి పడిపోకుండా చేశారు. గ్రిల్స్‌ను చూసిన భక్తులు ఆందోళన చెందుతున్నారు. రద్దీ సమయాల్లో ఎక్కువ మంది భక్తులు వస్తే పరిస్థితి ఏమిటని ఆలయ సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలో కొనసాగుతున్న ఈ ఆలయానికి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. శనివారం రోజున భక్తుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఆలయానికి ప్రతిరోజు వచ్చే భక్తులు స్వామి వారికి పెద్దఎత్తున కానుకలు సమర్పిస్తుంటారు. కానీ దేవాదాయ శాఖ అధికారులు మాత్రం భక్తులకు కనీస సదుపాయాలు కల్పించకపోవడం పట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'స్టీల్‌గ్రిల్స్ పడిపోయే పరిస్థితి ఉంది. దీనిపై చర్యలు తీసుకోవాలి' అని ఆలయ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న స్టీల్‌గ్రిల్స్‌కు మరమ్మతులు చేసి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. వేంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవీ ఆలయం వద్ద పగిలిన మార్బుల్స్‌ను కూడా మార్చాలని భక్తులు కోరుతున్నారు. ఆలయం బయట ఎలాంటి పార్కింగ్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు.



క్యూలో విరిగిన స్టీల్‌గ్రిల్స్‌ను తాళ్లతో కట్టిన సిబ్బంది



అశోకానగర్ టెంపుల్ రోడ్డు

మా వీధిలో రోడ్డు నిర్మించండి

గోల్నాక, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ అశోకానగర్ అమ్మవారి టెంపుల్ వీధి రోడ్డు నిర్మాణం చేయాలని స్థానికులు ప్రజాప్రతినిధులను, అధికారును వేడుకుంటున్నారు. సుమారు 8 ఏళ్లుగా తమ ప్రాంతంలో రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కొత్త రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యే కార్పొరేటర్‌కు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణం చేయాలని స్థానికులు వేడుకుంటున్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ

హాజరైన హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్‌లోని గంటసాల క్రీడా మైదానంలో డివిజన్ కార్పొరేటర్ పావనివినయ్ కుమార్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి శశిధర్‌రెడ్డి, కృష్ణయాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజులు హాజరై స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలన్నారు. అనంతరం అయ్యప్ప భక్తులు భిక్ష ప్రారంభించారు. రమేష్ బండారి చే అయ్యప్పస్వామి భక్తి గీతాల భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహాలక్ష్మి రామన్‌గౌడ్, అమృత, రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ ఎడ్ల భాగ్యలక్ష్మి హరిబాబు యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, శివముదిరాజ్ పాల్గొన్నారు.



పూజలో బండారు దత్తాత్రేయ, కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు

ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తదితరులు

నల్లకుంట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం డివిజన్‌లోని పద్మాకాలనీలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి గజవాడ అంజన్‌గుప్తా, కోశాధికారి శివకుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

● అయ్యప్ప మహాపడిపూజ

డివిజన్ పరిధిలోని న్యూనల్లకుంటలో అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. సహస్ర కళశాభిషేకం, వేద ఆశీర్వచనతో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, సీహెచ్ మోహన్, శంకరం రామ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.



జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు పి.గోవర్ధన్‌రెడ్డి తదితరులు

డీడీకాలనీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం

రాంనగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ డీడీకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు పి.గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం డీడీకాలనీలోని జలమండలి కార్యాలయం వద్ద పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేసి మాట్లాడారు. చలి నుంచి రక్షణ కోసం కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేయడాన్ని ప్రశంసించారు. అసోసియేషన్ నాయకులు డాక్టర్ పుట్ట పాండురంగయ్య, ఆర్.రాంరెడ్డి, వేముల కిరణ్‌రెడ్డి, కొత్తకోట సుబ్బారావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సుందరయ్యపార్కుకు బెస్ట్ క్లబ్ అవార్డు

రాంనగర్: నగరంలోని సుందరయ్యపార్కులో గల వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్‌కు బెస్ట్ క్లబ్ ఆఫ్ డిస్ట్రిక్ట్ 301 అవార్డు లభించింది. ఆదివారం జరిగిన వాకర్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ సదస్సులో ఈ అవార్డును క్లబ్ అధ్యక్షుడు ఆర్. వివేక్ అందుకున్నారు.

హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

బర్కత్‌పుర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు ఆరోపించారు. ఆరు గ్యారంటీలలో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై త్వరలో ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కాచిగూడ డివిజన్ 231 బూత్ అధ్యక్షుడుగా రాజును నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజా సమస్యలపై స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, నాయకులు కన్నె రమేష్‌యాదవ్, సూర్యప్రకాష్‌సింగ్, చిట్టి శ్రీధర్, శ్యామ్‌రాజ్, బుచ్చిరెడ్డి, క్షీరసాగర్, సుభాష్‌పటేల్, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాజుకు నియామకపత్రం అందజేస్తున్న డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు

మన్‌కీ బాత్‌కు విశేష స్పందన

ప్రధాని మోదీ నిర్వహిస్తున్న మన్‌కీ బాత్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో మన్‌కీ బాత్ కార్యక్రమం వీక్షించి మాట్లాడారు. మోదీ సారధ్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, నాయకులు కృష్ణగౌడ్, వనం రమేష్, కన్నె రమేష్‌యాదవ్, నందకిషోర్‌యాదవ్, ఎక్కాల నందు, సూర్యప్రకాష్‌సింగ్, శ్యామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులకు అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యం ఇవ్వాలి

మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోట రఘునాథరావు

బర్కత్‌పుర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపులకు అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యం ఇవ్వాలని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోట రఘునాథరావు కోరారు. ఆదివారం కాచిగూడ మున్నూరు కాపు భవన్‌లో మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మున్నూరుకాపు వివాహ పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వెయ్యిమందికిపైగా మున్నూరు కాపు వధువరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహ పరిచయ వేదికలను మున్నూరుకాపులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పి.విష్ణువర్ధన్, మహాసభ మాజీ అధ్యక్షుడు గంపా చంద్రమోహన్, దామెర జ్ఞానేశ్వర్‌రావు, లింగంశెట్టి హనుమంతరావు, గోపాలరాధాకృష్ణ, కొమ్ము శ్రీనివాస్, వినోద్‌కుమార్, కె.సురేష్ బాబు, మణికొండ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.



వివాహ పరిచయ వేదిక కార్యక్రమంలో పాల్గొన్న ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోట రఘునాథరావు

ఆలోచింపజేసిన సైన్స్ ఫెయిర్

రాంనగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్‌లోని గ్లోబల్ పాఠశాలలో జ్ఞాన ఎక్స్‌పో పేరిట జరిగిన సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ అందరినీ ఆలోచింపచేసింది. ఈ ఎక్స్‌పోను పాఠశాల డైరెక్టర్ బండారు గోవిందరావు, ప్రిన్సిపాల్ కవిత తదితరులు ప్రారంభించారు. ఈ ఎక్స్‌పోలో విద్యార్థుల సృజనాత్మకతకు ఆవిష్కరణల ప్రతిభను ప్రదర్శింపచేశాయి. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టుల నమూనా, ఆవిష్కరణలు కొత్త ఆలోచనలకు ప్రేరణ ఇచ్చే విధంగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి ఎగ్జి రిశీలిస్తున్న పాఠశాల డైరెక్టర్

మాజీమంత్రులు హరీష్‌రావు, కేటీఆర్‌లను అరెస్ట్ చేయాలి

తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి

రాంనగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారులకు అన్యాయం చేసిన మాజీమంత్రులు హరీష్‌రావు, కేటీఆర్‌లను వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి డిమాండ్ చేశారు. ఆదివారం చిక్కడపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమకారుల సేవలను వాడుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని విస్మరించి తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలపై ప్రభుత్వం కేసులు పెట్టి అరెస్ట్ చేయాలన్నారు. ఫోన్ ట్యాంపింగ్, ఈకార్ రేసింగ్, కాళేశ్వరం, అమరజ్యోతి నిర్మాణంలో జరిగిన అవినీతిపై, కోల్, కరెంట్, బియ్యం, భూమి, ఇసుకల మాఫీయాలపై విచారణ జరిపించి ఇద్దరు మాజీమంత్రులను అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి ప్రఫుల్‌రాంరెడ్డి, నగర జేఏసీ ప్రధాన కార్యదర్శి పాలడుగు గండయ్య, కార్యదర్శులు ఎస్.రాజయ్య, పి.యాదగిరి, చంద్రన్న పాల్గొన్నారు.

జనవరి 11న వడ్డె ఓబన్న జయంతి

జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ వేముల వెంకటేష్

రాంనగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వడ్డెరుల ఆరాధ్యులు వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను వచ్చే జనవరి 11వ తేదీన నగరంలోని రవీంద్రభారతిలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని ఉత్సవాల కమిటీ చైర్మన్ వేముల వెంకటేష్ తెలిపారు. సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఓబన్న జయంతి ఉత్సవాల సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణ కోసం రాష్ట్రంలోని వడ్డెర సంఘాల ప్రతినిధులతో ఉత్సవాల జేఏసీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వడ్డెర కులస్థులు వేలాదిగా తరలిరానున్నారని తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివరాత్రిఐలు మల్లు, మారయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



వడ్డే ఓబన్న ఉత్సవాల కమిటీ చైర్మన్ వేముల వెంకటేష్ తదితరులు

ఓఆర్ఆర్ టోల్‌లీజ్‌పై విచారణ జరిపించాలి

బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగంధర్‌గౌడ్

బర్కత్‌పుర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఓఆర్ఆర్ టోల్‌లీజ్‌పై అక్రమాలపై పూర్తి విచారణ జరిపించాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ లీజులో కోట్ల రూపాయల గోల్‌మాల్ జరిగాయని దీనిలో బీఆర్ఎస్ నేత కేటీఆర్ హస్తం ఉందని ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 ఏప్రిల్ 27న బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7,380 కోట్లతో ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థకు ఓఆర్ఆర్ టోల్ రోడ్డును 30 ఏళ్లకు లీజ్‌కు ఇచ్చారని ఆరోపించారు. ఈ లీజ్‌కు ఇచ్చినందుకు ఆ సంస్థ బీఆర్ఎస్ పార్టీకి 25 కోట్ల ఎలక్టోరల్ బాండ్‌ను గిఫ్ట్‌గా ఇచ్చిందని, ఇది కాకుండా మాజీమంత్రి కేటీఆర్‌కు కొంత డబ్బు ముట్టిందని ఆరోపించారు. ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థకు బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం ఔటర్ రింగ్ రోడ్డు బాధ్యతలు మాత్రమే అప్పగించి సర్వీస్‌రోడ్లు గ్రీనరీ బాధ్యతలు హెచ్ఎండీఏ నిర్వహించిందని, దీని వెనుక ఉన్న మతలబు ఏమిటని ప్రశ్నించారు. టోల్‌లీజ్‌పై అప్పటి క్యాబినెట్ తీర్మానం లేదని, ఆర్థిక శాఖ అప్రువల్ లేదని కేటీఆర్‌తోపాటు అప్పటి ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావును కూడా అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్లాట్‌ఫారం వద్ద నిలబడొద్దని చెప్పినందుకు..

ఆర్పీఎఫ్ హోంగార్డుపై పోకిరిల దాడి

బర్కత్ పుర డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్లాట్ ఫారం వద్ద నిలబడొద్దని చెప్పినందుకు ఆర్పీఎఫ్ హోంగార్డుపై పోకిరీలు దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో ఆదివారం జరిగింది. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. యాకత్‌పురా రైల్వేస్టేషన్లోని ప్లాట్ ఫారం వద్ద ఆదివారం రాత్రి కొంత మంది యువకులు నిలబడి ఉండగా.. ఇక్కడ ఎందుకు నిలబడ్డారని విధి నిర్వహణలో ఉన్న ఆర్పీఎఫ్ హోంగార్డు జంబన్న ప్రశ్నించారు. అందుకు పోకిరీలు మమ్మలనే ప్రశ్నిస్తావా అంటూ రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో జంబన్నకు గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. దాడి చేసిన వారు గంజాయి బ్యాచ్ కావచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు. త్వరలో నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

అక్షర వ్యాప్తికి కృషి చేసిన వెంకటరామారెడ్డి

ఘనంగా రెడ్డి హాస్టల్ మొదటి అలూమ్ని

అనేక విద్యా సంస్థలకు ప్రాణం పోశారు: మంత్రి కోమటిరెడ్డి

అఫ్జల్‌గంజ్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి తెలంగాణ అంతటా అక్షరాస్యతను వ్యాప్తి చేయాలనే సంకల్పంతో అనేక విద్యా సంస్థలకు ప్రాణం పోశారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. హైదరాబాద్ అబిడ్స్ రెడ్డి హాస్టల్ ఆవరణలో రాజా బహదూర్ వెంకటరామారెడ్డి హాస్టల్ మొదటి అలూమ్ని మీట్ సమావేశంలో.. మంత్రి వెంకటరెడ్డితో పాటు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వెంకట రామారెడ్డి 22 విద్యా సంస్థలను స్థాపించి, తన చివరి రోజుల వరకు వాటికి అధ్యక్షుడిగా పనిచేశారని మంత్రి వెల్లడించారు. మహిళల అభ్యున్నతి కోసం అనేక చర్యలు తీసుకున్నారన్నారు. ప్రముఖులను తయారు చేసిన ఘనత రెడ్డి హాస్టల్‌కు ఉందన్నారు. ఇదంతా కేవలం ఒక్క వ్యక్తివల్లే సాధ్యమయిందని అన్నారు. వనపర్తి జిల్లాలోని రాయన్నిపేట అనే చిన్న గ్రామంలో జన్మించి.. కష్టపడి కోత్వాల్ స్థాయికి ఎదిగారన్నారు. రెడ్డి అంటే మానవత్వం, సమాజ సేవ, కష్టానికి ప్రతిరూపమని ఒక ఊరు బాగుందంటే.. అక్కడ భూమిని నమ్ముకున్న రెడ్డి ఉంటాడని మంత్రి తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి